క్లుప్తంగా

లక్ష్యంతో చదివితే మంచి ఫలితాలు



జి.మాడుగుల గురుకులం పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

జి.మాడుగుల: పదో తరగతి విద్యార్థులు ఉన్నత చదువుల పట్ల దృష్టితో పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలని గురుకులం ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని గురుకులం పాఠశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పరీక్షల్లో అధిక మార్కులు సాధించి పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



కమిటీ సభ్యులకు బియ్యం, సరకులు అందజేస్తున్న పాత్రికేయుల బృందం

పాడేరు రూరల్: అరకులోయ, పాడేరు నియోజకవర్గాల పరిధిలో గల హుకుంపేట మండలం మత్స్యగుండం, అడ్డుమండ, పాడేరు, తుమరమెట్ట తదితర ప్రాంతాల్లోని శివాలయాల కమిటీలకు బియ్యం, నూనె వంటి నిత్యావసర వస్తువులను ఆదివాసీ విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్వరరావు, కృష్ణారావులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సరకులను అందజేశామన్నారు. పాత్రికేయుల సేవలను పలువురు అభినందించారు. రాంబాబు, హర్ష, శ్రీరాం, శివశంకర్, లక్ష్మేశ్వరరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై జోరుగా ప్రచారం



జి.ఎం.కొత్తూరులో ప్రచారం చేస్తున్న నాయకులు

జి.మాడుగుల: మండలంలోని జి.ఎం.కొత్తూరు, జి.మాడుగుల, నేరేడువలస తదితర గ్రామాల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మద్దతుగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సాగిన ధర్మన్న పడాల్, నాయకుడు వంతాల మల్లేశ్వరరావు సోమవారం ప్రచారం చేశారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు.

మార్చి 23న అష్టలక్ష్మి యాగం



యాగం నిర్వహణకు స్థలాన్ని పరిశీలిస్తున్న నిర్వాహకులు

ఎటపాక: లోక కల్యాణార్థం మార్చి 23న నిర్వహించనున్న అష్టలక్ష్మి యాగం కోసం ఉప్పగుండాల గ్రామం సమీపంలో స్థలాన్ని పీతాంబరం రఘునాథచార్యులు స్వామిజీ, యాగ నిర్వాహణ కమిటీ సభ్యులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ కార్యక్రమంలో భాగంగా మార్చి 2న 108 దంపతులచే భూమి పూజ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. గుండాల ఎంపీటీసీ సభ్యుడు జి.వెంకట్రామిరెడ్డి, జి.మాధవరెడ్డి, జగన్నాధరాజ్, రాజేంద్రప్రసాద్, ధనేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల వివరాలు నమోదు



రైతుల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో రాబిన్ సుదర్శన్

ఎటపాక: రైతులు విధిగా విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాబిన్ సుదర్శన్ తెలిపారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు 4380 మంది రైతులకు గాను 812 మంది ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందేందుకు రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రీ జరుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శైవ క్షేత్రాలు ముస్తాబు

- మహాశివరాత్రి వేడుకకు ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- విద్యుత్ దీపాలంకరణలో శివాలయాలు
- గ్రామాల్లో రేపటి నుంచి తిరునాళ్లు

అరకులోయటౌన్: జిల్లాలో మహాశివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. వేడుకలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జాతర్ల, తిరునాళ్ల ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా భజనలు, కోలాటాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి. భారీ అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పెదలబుడు, యండపల్లివలస, డింగ్రిపుట్, నందివలస గ్రామాల్లోని శివాలయాలు ముస్తాబవుతున్నాయి. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు.

హుకుంపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం మత్యగుండం మత్యలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు మండలంలోని అడ్డుమండ, చట్రాయిపుట్టు, ఉక్కుర్బ, సంపంగిపుట్టు గ్రామాల్లోని శివాలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

డుంబ్రిగుడ: అరకుతో పాటు కురిడి, అరకు, కించుమండ, గుంటసీమలలో శివాలయాలు ముస్తాబయ్యాయి. గుంటసీమలో జంగమయ్య జాతరను మార్చి 10న నిర్వహించనున్నట్టు సర్పంచ్ గుమ్మా నాగేశ్వరరావు తెలిపారు.



కురిడిలో ముస్తాబైన శివాలయం

జి.మాడుగుల: మండలంలో గెమ్మెలి, లువ్వాసింగి పంచాయతీ సంగులోయలో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు కమిటీలు ముమ్మర ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రంతోపాటు వంజరి, జి.కొత్తూరు, గెమ్మెలి గ్రామాల్లో జాతర్ల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల స్థాయి, నియోజకస్థాయి వాలీబాల్, క్రికెట్ పోటీలను నిర్వహించారు.

చింతపల్లి: మండలంలో బౌడ గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు అర్చకుడు నగేష్ శర్మ తెలిపారు.

కొయ్యూరు: మండల కేంద్రంలోని వెలసిన భ్రమరాంభిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మూడు రోజుల పాటుతీర్థ మహోత్సవాలు జరుగుతాయి.



కించుమండలోని ఆలయంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కమిటీ సభ్యులు, పూజార్లు

అడ్డతీగల: అడ్డతీగల–డి.భీమవరం రోడ్డులో వేంచేసిన స్వయంభు ఉబ్బులింగేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబైంది. స్వయంభుగా వేంచేసిన ఉబ్బులింగేశ్వరస్వామి వారు కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా స్థానికులు కొలుస్తారు. రాయపల్లిలోని భ్రమరాంభికా మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

కూనవరం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కుమారస్వామి గుట్టపై కొలువుదీరిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం, పవిత్ర శబరి గోదావరి సంగమతీరంలో వెలసిన శబరి దుర్గాంభ సంగమేశ్వర స్వామి వారి ఆలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా 25 నుంచి 28వ తేదీ వరకు వేడుకలు జరగనున్నాయి. శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం గురువారం అంగరంగ వైభవంగా జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.



హుకుంపేట ఉక్కుర్బలో భీమలింగేశ్వర స్వామి ఆలయం



రాజవొమ్మంగిలోని శ్రీరాజరాజేశ్వరిసమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయం



గొల్లగూడెం శివాలయంలోని దత్తాత్రేయుడి విగ్రహం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వరిసమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో బుధవారం సాయంత్రం స్వామి వారి కల్యాణ వేడుక నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. జడ్డంగిలోని శ్రీ భ్రమరాంభికా మల్లికార్జునస్వామి వారి ఆలయం శివరాత్రి మహోత్సవాలకు ముస్తాబైంది. ఆలయం వద్ద నాలుగు రోజుల పాటు జరిగే తిరునాళ్లకు ఏర్పాట్లు చేశారు.

ఎటపాక: మండలంలోని గొల్లగూడెం, గన్నవరం, నెల్లిపాక, బుట్టాయిగూడెం, వెంకటరెడ్డిపేటలో గ్రామాల్లో శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి వేడుకలకు కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సంతబయలులోని ఆలయంలో శివలింగం



బౌడ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొయ్యూరులో ప్రత్యేకాలంకరణలో భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి



అడ్డతీగలలో పూజలు చేస్తున్న భక్తులు



కూనవరంలోని కుమారస్వామి గుట్టపై కొలువు దీరిన శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం

శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు

వై.రామవరం: మండలంలోని పూతిగుంట పరమేశ్వరుని ఆలయం వద్ద నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు భద్రతా ఏర్పాట్లను అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు భద్రతను ఏర్పాటు చేయాలని ఎస్ఐ బి.రామకృష్ణకు ఆదేశించారు. ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. వాహనాల పార్కింగ్, భక్తుల రద్దీకి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ, సిబ్బందికి సలహాలు సూచనలిచ్చారు.



పూతిగుంట పరమేశ్వరుని ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సిఐ నరసింహమూర్తి

అరకులోయటౌన్: మహాశివరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేలా చూడాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని అరకులోయ సీఐ ఎల్. హిమగిరి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. అరకులోయ పోలీస్ సర్కిల్ పరిధిలోని బొర్రాగుహలు, డింగ్రిపుట్, ఎం.హట్టగుడ, కురిడి, కాశీపట్నం, లంగుపర్తి ఇతర పుణ్యక్షేత్రాల్లో బుధవారం జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని ఉత్సవ కమిటీ సభ్యులకు ఆయన పలు సూచనలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా పోలీసులకు సమాచారం అందిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని సీఐ హిమగిరి చెప్పారు.



అరకులోయ సీఐ హిమగిరి

వర్మీకంపోస్టు యూనిట్ పరిశీలన

అడ్డతీగల: చెత్త నుంచి సంపద కేంద్రాల్లో ఎరువు తయారీ పనులు తక్షణమే చేపట్టాలని రంపచోడవరం డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీవో) నరసింగరావు ఆదేశించారు. అడ్డతీగల మండలం బొడ్లంకలోని సంపద కేంద్రాన్ని (వర్మీకంపోస్టు యూనిట్) ఆయన సోమవారం తనిఖీ చేశారు. చెత్తను వేరు చేసిన విధానాన్ని పరిశీలించారు. ఎరువు తయారీ పనులు చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు తడి చెత్త, పొడి చెత్త సేకరించి వాటిని విభజించి ఎరువు తయారీకి అనుగుణంగా పనులు చేయించాలని బొడ్లంక సర్పంచ్ బోనెం రాఘవ, గ్రామ సచివాలయ సిబ్బందిని ఆయన ఆదేశించారు. నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేసి గ్రామ పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవాలన్నారు.



బొడ్లంక సంపద కేంద్రం పరిశీలించి సూచనలిస్తున్న డిఎల్‌పిఓ నరసింగరావు

ప్రతిభ పోటీల్లో విజేతలకు బహుమతులు

ఎటపాక: మండల స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు హోలీ స్పిరిట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభ పోటీలు సోమవారం ముగిశాయి. గౌరిదేవిపేట హైస్కూల్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. వ్యాసరచన, డిబేట్, క్విజ్, పాటల పోటీలు జరిగాయి. పోటీల్లో విజేతలకు ఎంఈవో సరియం రాజులు, వైస్ ఎంపీపీ మంగేశ్వరావు, వైద్యులు దేవినాగ్, శ్రీదేవి, సొసైటీ మాజీ చైర్మన్ వెంకట రామారావు తదితరులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రాజులు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో భాగంగా వ్యాసరచన పోటీల్లో సీనియర్స్ విభాగంలో డి.పల్లవి, జూనియర్ విభాగంలో ఎం.సాన్విత, వక్తృత్వ పోటీలు సీనియర్ విభాగంలో పి.వినీల, జూనియర్ విభాగంలో పి.వినయ్‌కుమార్, క్విజ్‌లో నెల్లిపాక టీమ్,పాటల పోటీలో సీనియర్ విభాగంలో పి.వినీల, జూనియర్ విభాగంలో టి.లోక్షిత్ విజేతలుగా నిలిచారు. స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు జి.జాన్సన్, రవి, హెచ్‌ఎం కణితి శేఖర్, యూత్ సభ్యులు శ్రీనివాసరావు, హరిబాబు, ప్రసాద్, ప్రకాష్, గోపి, శివ, ప్రవీణ్, మదార్, నాగర్జున్, శ్రీను, బాబి, సందీప్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వైభవంగా వీరభద్రస్వామి ఉత్సవం

సాక్షి,పాడేరు: జిల్లా కేంద్రంలో వీరభద్రస్వామి ఉత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పాడేరులో వీరభద్రస్వామి పండగను వెయ్యాకుల కుటుంబం నిర్వహించడం ఆనవాయితీ. గరగల డప్పు వాయిద్యాల నడుమ వీరభద్రస్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. గురుస్వామి వెయ్యాకుల సత్యనారాయణ, శ్రీను సోదరులు తమ ఇంటి వద్ద వీరభద్రస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంగమసేవా సంఘంతో పాటు భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో గంగమ్మతల్లికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పూజరి రామ్మూర్తి తదితరులు గంగమ్మతల్లి, పోతురాజు విగ్రహాలను గృహం నుంచి బయటకు తీసి శుద్ధి చేశారు. అనంతరం గ్రామంలో విగ్రహాలను ఊరేగించారు. ప్రతి ఇంటి వద్ద పూజలను నిర్వహించారు. సర్పంచ్ వెంగడ రమేష, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శంకర్‌రావు తదితరులు పర్యవేక్షించారు.



పాడేరులోని ఉత్సవ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీవో తేజ్‌రతన్

జి.మాడుగుల: తాగునీటి సమస్య తలెత్తకుండా సమ్మర్ క్రాష్ ప్రోగాంను ప్రారంభించినట్టు ఎంపీడీవో తేజ్‌రతన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రణాళికబద్ధంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో పాడైన చేతి బోర్లు మరమ్మతు పనులు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్, ఎంఆర్‌సీ సావిత్రి, సిబ్బంది బాలు, రవి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్నికల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. కేంద్రంలో విద్యుత్, తాగునీటి సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులతో సమావేశమయ్యారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంఈవో ప్రసాద్, హెచ్‌ఎంలు వి.అప్పారావు , భద్రం పడాల్ పాల్గొన్నారు.

స్తంభించిన బీఎస్ఎన్ఎల్ సేవలు

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో గత మూడు రోజులుగా బీఎస్ఎన్ఎల్ సేవలకు అంతరాయం ఏర్పడింది. దీంతో అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల పరిధిలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. సెల్ సిగ్నల్స్‌తో పాటు బ్రాడ్ బ్యాండ్, ఫైబర్ నెట్ సేవలు నిలిచిపోయాయి. తరచూ బీఎస్ఎన్ఎల్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

శివరాత్రి ఉత్సవాలపై ప్రచారం



కురిడిలోని ప్రచారంలో పాల్గొన్న జెడ్పీటీసీ జానకి, సర్పంచ్ శారద

డుంబ్రిగుడ: మండలంలోని అరకు గ్రామంలోని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించే శివరాత్రి మహోత్సవాలపై జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, సర్పంచ్ శారద ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. మండలంలోని అరకు, కురిడి, ఎండపల్లివలస, పప్పుడువలస గ్రామాల్లో శివలింగాలతో ఊరేగింపు నిర్వహించి, వేడుకలపై ప్రచారం చేశారు. శివరాత్రి వేడుకల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

ప్రీ ప్రైమరీ బోధనపై ప్రత్యేక దృష్టి



పెదబయలులోని కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది



పెదబయలులో మాట్లాడుతున్న ఎంఈవో పుష్పాజోసెఫ్

పెదబయలు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈవో పుష్పజోసెఫ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీప్రైమరీ బోధనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆట, పాటలతో చిన్నారులకు విద్యను అందించాలని సూచించారు. చిన్నారుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. ఉపాధ్యాయులు మాలంనాయుడు. ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



అడ్డతీగలలో శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏఎంవో భాస్కరరావు, సిబ్బంది

అడ్డతీగల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని ఏఎంవో(అకడమిక్ మోనటరింగ్ అధికారి) కె.భాస్కరరావు సోమవారం పర్యవేక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానజ్యోతి శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలుచేసి, ప్రీస్కూల్‌లోని బాలలకు తర్ఫీదు ఇవ్వాలన్నారు. శిక్షణ లక్ష్యాన్ని నూరుశాతం నెరవేర్చాలన్నారు. ఏఈవో పి.శ్రీనివాసరావు, ఇన్‌చార్జి సీడీపీవో పావని, డీఆర్పీలు నాగప్రసాద్, శ్రీనివాస్, అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



కొయ్యూరులో కాగితాలతో తయారు చేసిన వస్తువులను ప్రదర్శిస్తున్న సీడీపీవో, వర్కర్లు

కొయ్యూరు: మండల కేంద్రంలోని సీడీపీవో విజయకుమారి ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ విద్యపై అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆట, పాటలు, బొమ్మలతో చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలని ఆమె సూచించారు. ఎంఈవో రాంబాబు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు.

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో అంగన్‌వాడీ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీవో లక్ష్మి మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ బోధనపై అందరికీ అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు.

గంగవరం: గంగవరంలో జరుగుతున్న జ్ఞానజ్యోతి కార్యక్రమంలో పాల్గొన్న అకడమిక్ మోనటరింగ్ అధికారి కె.భాస్కరరావు అంగన్‌వాడీ సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఎంఈవో మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలను అకడమిక్ మోనటరింగ్ అధికారి భాస్కర్ సోమవారం పర్యవేక్షించి, పలు సూచనలిచ్చారు. ఎంఈవో–1 సత్యనారాయణదొర, ఎంఈఓ–2 సూరయ్యరెడ్డి, హెచ్‌ఎం రాజ్ దినకర్, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా అధికారి భాస్కర్



గూడెంకొత్తవీధిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది